పార్కుల్లో ఫిట్‌నెస్ మంత్ర

నాడు.. గత ప్రభుత్వ హయాంలో పార్కులు పిచ్చి తుప్పలు, డొంకలతో నిండి భయకరంగా ఉండేవి. అక్కడక్కడ కాలనీ వాసులు ముందుకు వచ్చి పార్కులను కొంతవరకు శుభ్రపరుచుకుని వాడుకోవడంతో పిల్లలకు కొంత ఉపమోగపడేవి. ఇక పెద్దల విషయానికొస్తే కాలక్షేపం కోసం పార్కులకు వెళ్లేవారు. అభివృద్ధికి నోచుకోని పార్కులను చూసి వ్యాయామం మాటే మరిచిపోయేవారు.

నేడు.. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాలనీల్లోని పార్కులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది. పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడంతో పార్కులు నందనవనాలను తలపిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పార్కులు ఆహ్లాదకరంగా మారాయి. వాకింగ్ ట్రాక్‌లతో పాటు చిన్నారులకు ఆట పరికరాలు, ఓపెన్ జిమ్‌లు, చుట్టూ రక్షణ గోడలు, భద్రతకు పెద్దపీట వేస్తూ ఆకర్షణీయమైన ముఖద్వారాలు ఏర్పాటు చేశారు.


అంబేడ్కర్ వాకర్స్ పార్కులోని ఓపెన్‌జిమ్‌లో సాధన చేస్తున్న స్థానికులు

- లక్షల రూపాయలతో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు
- వ్యాయామంపై ఆసక్తి చూపుతున్న ప్రజలు
- ఉద్యానవనాలకు పెరుగుతున్న ఆదరణ



పార్కుల్లో ఓపెన్‌జిమ్ కోసం వెచ్చించిన నిధులు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వాకర్స్ పార్కు : రూ.10 లక్షలు
వడ్లపూడి ఈ-సేవ గ్రౌండ్ : సుమారు రూ.4 లక్షలు
రావుల చెరువు వాకర్స్ పార్కు : సుమారు రూ.7 లక్షలు
తిరుమల నగర్ చిల్డ్రన్స్ పార్క్ : రూ.10.5 లక్షలు

కూర్మన్నపాలెం: ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పార్కులు కొత్త రూపును సంతరించుకుంటున్నాయి. ప్రభుత్వ నిధులతో ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేయడంతో ప్రజల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతోంది. దీంతో ప్రజలు తమకు అనుకూలమైన సమయాల్లో పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లోని పరికరాలతో వ్యాయామం చేసుకుని, ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటున్నారు. వీటి నిర్వహణ బాధ్యతలను కూడా ఐదేళ్ల పాటు సదరు కాంట్రాక్టర్లకే అప్పగించడంతో ఓపెన్ జిమ్‌లలో పరికరాలు పాడైన వెంటనే, వాటిని బాగు చేయించి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. జీవీఎంసీ 86, 87వ వార్డుల పరిధిలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు ప్రజాదరణ పొందుతున్నాయి.


వ్యాయామం చేస్తున్న మహిళలు

వ్యాయామంపై ఆసక్తి

మారిన జీవనశైలి, పెరుగుతున్న మానసిక ఒత్తిడి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీంతో దాదాపు అన్ని వయసుల వారు చిన్న చిన్న **రుగ్మతలతో సతమతమవుతున్నారు.** మానసిక ఒత్తిడితో బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు శరీరంలో తిష్ట వేస్తున్నాయి. రోజూ వందలాది మంది ప్రజలు రోగాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. దీని నుంచి బయటపడేందుకు వైద్యులు, మానసిక నిపుణులు సైతం రోజులో కొంతసేపు వ్యాయామం తప్పనిసరి అని సూచించడంతో అందరిలో వ్యాయామంపై ఆసక్తి పెరుగుతోంది.

మహిళలకు ఎంతో ఉపయోగం



నివాసాలకు దగ్గరలోనే ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేయడం వల్ల మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. చాలా రోజుల నుంచి వ్యాయామం చేయాలని అనుకుంటున్నాను. మా ఇంటికి దగ్గరలోనే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో నేను ప్రతి రోజు వచ్చి వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉంటున్నాను. ప్రభుత్వం ప్రజారోగ్యం, అభివృద్ధిపై ఎంతో శ్రద్ధ కనబరచడం చాలా బాగుంది.

– సునీత, వడ్లపూడి

బరువు తగ్గాను



నేను బరువు తగ్గాలని చాలా రోజులుగా డాక్టర్ సలహా ఇస్తున్నారు. దూరంగా వెళ్లలేక, ప్రత్యేకంగా జిమ్ కోసం డబ్బు వెచ్చించలేక పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు మాకు సమీపంలోనే పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ వల్ల నాకు సౌలభ్యంగా ఉంది. రోజూ వెళ్లి వ్యాయామం చేస్తున్నాను. చాలా వరకు బరువు తగ్గాను. ఇప్పుడు పార్కును చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా ఉంది. గతంలో పార్కులోకి అడుగు పెట్టాలంటేనే ఎంతో భయం వేసేది. అప్పటికీ ఇప్పటికీ ఎంతో మార్పు. హ్యాట్సాఫ్ టు సీఎం జగన్ సర్.

– రామారావు, తిరుమలనగర్

క్లుప్తంగా

త్వరితగతిన అభివృద్ధి పనులపై హర్షం


గుడివాడ లతీష్‌కు మొక్క అందజేస్తున్న పోవా ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం వద్ద గల పంచవటీలో అడిగిన వెంటనే అభివృద్ధి పనులకు సహకరించిన వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్‌కు పంచవటీ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ (పోవా) ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. మిందిలోని ఆయన నివాసంలో లతీష్‌ను ఆదివారం కలిసిన వారు మొక్కను అందించి, ధన్యవాదాలు తెలిపారు. పోవా అధ్యక్షుడు పి.చిన్నారావు మాట్లాడుతూ రూ.19 లక్షలతో రోడ్డు నిర్మాణంతో పాటు పంచవటిలో పలు అభివృద్ధి పనులకు సత్వరం చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి సంధ్రాన నూకరాజు, పలువురు పోవా ప్రతినిధులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారానికి సహకరించండి'


బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు పాండ్యకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారానికి సహకరించాలని స్టీల్ బీఎంఎస్ నాయకులు కోరారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా విశాఖ వచ్చిన బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు హిరణ్మయ పాండ్యను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా ముడి పదార్థాల కొరత తీర్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు కె. శ్రీనివాసరావు, రాందాస్ నరేంద్ర, ఎం.రామస్వామి, ఎం.వి.ఎస్. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టులో ఉద్యోగికి అస్వస్థత


బాధితుడిని 108లో ఆస్పత్రికి తరలిస్తున్న ఏసీపీ మోజెస్ పాల్

పెదగంట్యాడ: గంగవరం పోర్టులో పని చేస్తున్న ఓ ఉద్యోగి ఆదివారం అస్వస్థతకు గురవడంతో, ఆస్పత్రికి తరలించారు. వివరాలివి.. గంగవరం గ్రామానికి చెందిన అర్జల అమ్మోరు (45) గంగవరం పోర్టులో 16 ఏళ్లుగా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఆదివారం ఉదయం ఏ షిఫ్ట్‌కు డ్యూటీకి వెళ్లిన అమ్మోరు ఒక్కసారిగా అక్కడ కుప్పకూలిపోయాడు. దీంతో వెంటనే అతన్ని ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించేందుకు పోర్టు అధికారులు సిద్ధం చేయగా.. తోటి కార్మికులు అడ్డుకుని, ప్రైవేటు ఆస్పత్రికి తరలించాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో ఒక్కసారిగా అక్కడి వాతావరణం వేడెక్కింది. ఈ నేపథ్యంలో అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అర్బన్ ఏసీపీ మోజెస్ పాల్, న్యూపోర్టు సీఐ దాలిబాబు సిబ్బందితో అక్కడికి చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడారు. ఆపై ఏసీపీ మోజెస్ పాల్ స్వయంగా 108 వాహనంలో బాధితుడిని షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అమ్మోరు అక్కడ చికిత్స పొందుతున్నారు.

30 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: పరవాడ గ్రామానికి చెందిన చింతాడ శివసాయి ఆదివారం స్థానిక మద్యం దుకాణం నుంచి అక్రమంగా 30 మద్యం సీసాలు తరలిస్తుండగా ఎస్ఐ మల్లేశ్వరరావు దాడి చేసి పట్టుకున్నారని పరవాడ సీఐ బాలసూర్యారావు చెప్పారు. అక్రమ మద్యం సీసాలతో సంబంధం ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

ఇంటింటా నీరాజనం

అక్కిరెడ్డిపాలెంలో ఉరుకూటి చందు పాదయాత్రకు విశేష స్పందన


ఉరుకూటి చందుకు హారతి పడుతున్న రజక సంఘాల నాయకులు


వృద్ధులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న చందు, కార్పొరేటర్ అనూష

అక్కిరెడ్డిపాలెం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పేదలకు ఇంటికే సంక్షేమ పథకాలు అందించారని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్‌లతో కలిసి ఆదివారం సాయంత్రం ఆయన పాదయాత్ర నిర్వహించారు. గ్రామంలో మహిళలు చందుకు హారతులు పట్టి, ఆశీర్వదించారు. గ్రామంలోని దుర్గాలమ్మ, కుంచాలమ్మ, నూకాలమ్మ వార్లను, రామాలయంలో సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. రజక సంఘాల నాయకులు, స్థానికులు గ్రామంలో అడుగడుగునా వారికి నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ సీఎం జగన్ విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. తిరిగి జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుంటే మెరుగైన పాలన కొనసాగుతుందన్నారు. చంద్రబాబు అధికారం కోసం చేస్తున్న అబద్ధపు వాగ్దానాలకు మోసపోవద్దని హితవు పలికారు. జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు 99 శాతం నెరవేర్చారని, అందుకే ధైర్యంగా ఎన్నికలకు వెళ్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిత్యం పొత్తులు, అధికారం అంటున్నారే తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన లేదని దుయ్యబట్టారు. నిత్యం పేదలకు మంచి చేయాలని పరితపిస్తున్న జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వరదాడ వెంకటరమణ, సంధ్రాన నూకరాజు, రెడ్డిపల్లి చిట్టిబాబు, ఈటి సురేష్, నేలపాటి సత్యవతి, గొంతిన సత్యవతి, నంబారు రాజు, మానిటరింగ్ కమిటీ మెంబర్ బోనెల జోసెఫ్, కటికల కల్పన, జలగడుగుల శ్రీనివాస్, గుర్రం రాజేష్, గుర్రం త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. పార్వతీ పరిణయం


కల్యాణోత్సవం అనంతరం కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 66వ వార్డు కై లాస్ నగర్‌లో కొలువైయున్న శ్రీ కనకదుర్గాంబికా ఆలయ వార్షిక వేడుకల్లో భాగంగా శివ పార్వతుల కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక మండపంలో శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి, వేద పండితులు శాస్త్రోక్తంగా వేడుక జరిపించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. లోక కల్యాణార్థం ప్రతీ ఏటా ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు తెలిపారు. తొలిపూజను మాజీ కౌన్సిలర్ రెడ్డి జగన్నాధం దంపతులు నిర్వహించారు. కార్యక్రమంలో కర్రి వెంకట సత్యనారాయణ రెడ్డి, కర్రి జగన్మోహనరావు, కరణం వేణుగోపాలరావు, భాష్యం త్రినాథ్, గండ్రేటి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలి


1109వ రోజు దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల పోరాటాల ఫలితంగా ఏర్పడిన స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా దేశ ప్రజలందరూ ఏకమై కాపాడుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు సూచించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1109వ రోజు, ఆదివారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు విషయంలో ప్రజలందరూ కేంద్రప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. సంస్థ కోసం కార్మికులు నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్రంలో చలనం లేకపోవడం దారుణమన్నారు.

రేపు పాదయాత్ర

ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడంలో కార్మిక వర్గంతో పాటు దేశప్రజలంతా మమేకమై పాల్గొనాలని కోరారు. ఈ నెల 27న కూర్మన్నపాలెం దీక్ష శిబిరం నుంచి జీవీఎంసీ దీక్ష శిబిరం వరకు జరిగే పాదయాత్రలో కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని మోదీ సానుకూల ప్రకటన చేయాలి


పెదగంట్యాడ జంక్షన్ నుంచి పాదయాత్ర చేస్తున్న అఖిల పక్షాల నాయకులు

పెదగంట్యాడ: వచ్చే నెల 1న విశాఖ పర్యటనకు రానున్న ప్రధాని నరేంద్ర మోదీ.. 'విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుంది' అని ప్రకటన చేయాలని అఖిల పక్ష సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ పిలుపు మేరకు ఐఎస్‌టీయూసీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన పెదగంట్యాడ జంక్షన్ నుంచి నడుపూరు వరకు ఆదివారం ఉదయం మహా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1100 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అదానీకో, అంబానికో స్టీల్‌ప్లాంట్‌ను ధారాదత్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ఎలా ప్రైవేటుపరం చేస్తారని ప్రశ్నించారు. పెదగంట్యాడ జంక్షన్ వద్ద ప్రారంభమైన ఈ పాదయాత్ర సిద్దేశ్వరం, దళ్లివానిపాలెం, కోరాడ, సీతానగరం, బాలచెరువు, నెల్లిముక్కు మీదుగా నడుపూరు వరకు సాగింది. కార్యక్రమంలో అనిపెద్ది మసేనురావు, నీరుకొండ రామచంద్రరావు, రామస్వామి, పులి వెంకటరమణారెడ్డి, బొడ్డు పైడిరాజు, గొందేశి మహేశ్వరరెడ్డి, డీవీ రమణారెడ్డి, మంత్రి శంకరనారాయణ, జెర్రిపోతుల ముత్యాలు, చెల్లు బోయిన నాయుడు, నెల్లి అప్పలరాజు, కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 ప్రిలిమ్స్


గాజువాకలో పరీక్ష కేంద్రం వద్ద క్యూ లైన్‌లో అభ్యర్థులు


నడుపూరు హైస్కూల్లో పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు

గాజువాక: గ్రూప్-2 ఉద్యోగ నియామకాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష కొనసాగింది. గాజువాకలోని ఎనిమిది కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 3051 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 2691 మంది హాజరయ్యారని, 360 మంది గైర్హాజరయ్యారయ్యారని తెలిపారు. ఒక్కో పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో గైర్హాజరయ్యారు. స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో 480 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 52 మంది హాజరుకాలేదు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 500 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 62 మంది గైర్హాజరయ్యారు. ప్రతీ కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నడుపూరు హైస్కూల్లో..

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షకు 400 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 78 మంది గైర్హాజరయ్యారు. 266 మంది పురుష అభ్యర్థులకు గాను 54 మంది గైర్హాజరు కాగా.. 134 మంది మహిళా అభ్యర్థులకు గాను 24 మంది హాజరు కాలేదు. పరీక్ష కేంద్రం వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా న్యూపోర్టు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే దోహదం


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

అక్కిరెడ్డిపాలెం: ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆటోనగర్‌లోని ఓ పాఠశాలలో నిర్వహించిన 9వ జిల్లా స్థాయి కరాటే పోటీలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు హాజరయ్యారు. వీరి చేతుల మీదుగా కరాటే పోటీల విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వెడోకాయ్ కరాటే డు అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కోచ్ రాము, పుష్పారావు తదితరులు పాల్గొన్నారు.

అండిబోయిన అప్పారావుకు సత్కారం


అప్పారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి

పెదగంట్యాడ: జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన అండిబోయిన అప్పారావును యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సూపర్ మాస్టర్స్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 13 వరకు గోవాలో నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వుడా కాలనీకి చెందిన అండిబోయిన అప్పారావు స్వర్ణపతకం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అప్పారావుకు ఉక్కు అధికారుల ఆధ్వర్యంలో వుడా కాలనీ వినాయకనగర్‌లో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, స్టీల్‌ప్లాంట్ డీజీఎం సత్యనారాయణ, ఏజీఎం అప్పారావు, సీనియర్ మేనేజర్ మల్లుల సూర్యనారాయణ, మేనేజర్ పిల్లి చంద్రరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వనుము నాగేశ్వరరావు, దొమ్మేటి రమణారావు, చప్పిడి నాగరాజు, ఈశ్వరరావు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ


బల్లల పండగలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి

అగనంపూడి/అక్కిరెడ్డిపాలెం: రజకుల సంప్రదాయ పండగను అగనంపూడి పునరావాస కాలనీలో ఆదివారం ఘనంగా జరిపించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య మాట్లాడుతూ రజకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రజకుల ఆరాధ్యదైవం వీరభద్ర స్వామి వడివేలు మాచయ్య బొర్రమాంబ తల్లికి పూజలు చేశారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు తోకాడ రాము, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, అఖిల పక్షాల నాయకులు బలిరెడ్డి శ్రీను, సత్యనారాయణ, రజక సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, కోనేటి రవి తదితరులు పాల్గొన్నారు.

తుంగ్లాంలో.. : 69వ వార్డు తుంగ్లాంలో రజకుల బల్లల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్త్రీ పెట్టెలు, బల్లలకు పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, రజక సంఘం సభ్యులు తోకాడ రాము, పట్నాల ప్రసాద్, ఎ.ప్రసాద్, దుప్పాడ రాము తదితరులు పాల్గొన్నారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ

టెన్త్ విద్యార్థుల ప్రత్యేక తరగతుల పరిశీలన


లంకెలపాలెం హైస్కూల్లో మాట్లాడుతున్న అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ

అగనంపూడి: పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదవాలని అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ విద్యార్థులకు సూచించారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి ప్రత్యేక శిక్షణ తరగతులను ఆదివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. సబ్జెక్టుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకుని ప్రతీ విద్యార్థి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యాశాఖ కార్యాలయ అధికారి వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఎస్సీల భూములు వారికే కేటాయించాలి'

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్


ఎస్సీ, బీసీలతో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

అగనంపూడి: గతంలో ఎస్సీల సాగు కోసం కేటాయించిన భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటే, వేరే అవసరాలకు కేటాయించడానికి వీలు లేదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ స్పష్టం చేశారు. అగనంపూడి సర్వేనంబర్ 56 పార్టు 1, 2ల్లోని భూములను ఆయన పరిశీలించారు. కొంతమంది పట్టాదారులు ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో సదరు భూములను పరిశీలించిన ఆయన మాట్లాడారు. 15 మంది ఎస్సీ, బీసీలకు కేటాయించిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పట్టాలను రద్దు చేస్తే తిరిగి ఎస్సీ అవసరాలకే కేటాయించాలి తప్ప వేరే అవసరాలకు ఎలా కేటాయిస్తారని రెవెన్యూ అధికారులను నిలదీశారు. ఈ విషయంలో గాజువాక తహసీల్దార్ వల్లీ రికార్డులు చూపించి వివరించే ప్రయత్నం చేశారు. ఆర్డీవో, సౌత్ ఏసీపీలు వివాద స్థలంలో జరుగుతున్న నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. వారిద్దరూ తన ముందుకు బుధవారం హాజరు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో పట్టాదారుల తరపున ఓదురు అప్పారావు, కోసూరి తాతారావు, తోకాడ రాము తదితరులు మాట్లాడారు.

ఇష్టానుసార పార్కింగ్‌పై కొరడా

విశాఖ సిటీ: రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేసే వారిపై చర్యలకు పోలీస్ శాఖ సమాయత్తమవుతోంది. రోడ్లపై, నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలపడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారికి చలానాలు వేయాలని నిర్ణయించింది. మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ. రవిశంకర్ ఆదేశాల మేరకు నగర పరిధిలోని షాపింగ్ మాల్స్, ప్రధాన షాపుల యాజమాన్యంతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వాహనాలు సెల్లార్‌లో పార్కింగ్ చేసుకునేలా చూడాలని సూచించారు. వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే రూ.1000 జరిమానా విధించనున్నారు. వాహనాలను టోయింగ్ రికవరీ వ్యాన్‌తో తీసుకువెళ్లి, వీల్ లాక్స్ చేస్తామని ఏడీసీపీ(ట్రాఫిక్) శ్రీనివాస్ స్పష్టం చేశారు. అలాగే పార్కింగ్ సౌకర్యం ఉండి పార్కింగ్‌కు వినియోగించని షాపుల యాజమాన్యంపై కూడా చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే మోటార్ వాహనాల చట్టం ప్రకారం మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తారని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై, మోటార్ వాహన నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఉక్కు పోరాటానికి 'భెల్ సిటూ' సంఘీభావం


జీవీఎంసీ వద్ద దీక్ష శిబిరంలో సంఘీభావం తెలుపుతున్న భెల్ సిటూ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ సంఘీభావం తెలిపింది. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్ష శిబిరంలో ఆదివారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీహెచ్‌పీవీని ప్రైవేట్ సంస్థ అయిన ఎల్ అండ్ టీ హస్తగతం చేసుకోవడానికి వచ్చినప్పుడు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేసి సంస్థను కాపాడుకున్నామన్నారు. అదేవిధంగా ఎంతోమంది ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను సమష్టిగా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్.జగన్నాధరావు, ఎస్.ప్రసాద్, కె.నారపురెడ్డి, ఎస్.అప్పారావు, జి.అచ్చింనాయుడు, ఎస్.వెంకట్రావు, పి.శివరాం, సీహెచ్.ఎస్.వి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.